
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com
31-10-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2





లక్ష్మాపూర్‌లో సివిల్ రైట్స్ డే



అక్షరటుడే, ఎల్లారెడ్డి: ప్రతిఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవడంతో పాటు ఇతరుల హక్కులను గౌరవించాలని తహశీల్దార్ ప్రేమ్ సూచించారు. మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన సివిల్ రైట్స్‌డే ఈ సందర్భంగా పౌరుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. సమాజంలో కుల, మత, వర్గ వివక్షకు తావులేకుండా సమానత్వ భావనతో మెలగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రేమ్, ఏఎస్సై దేవాగౌడ్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమే : సీపీ

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం : పదవీ విరమణ అనేది ప్రతి ఒక్క ఉద్యోగికి సహజమేనని సీపీ సాయి చైతన్య అన్నారు. పోలీస్ శాఖ నుంచి ఉద్యోగ విరమణ చేస్తున్న పలువురిని సీపీ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. ఎటువంటి రిమార్క్ లేకుండా సుదీర్ఘ కాలం సేవలందించి పదవీ విరమణ పొందడం అభినందనీయమన్నారు. డిపార్ట్‌మెంట్ తరపున ఎల్లవేళలా సహకారం ఉంటుందని, పదవీ విరమణ అనంతరం తమ కుటుంబాలతో ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. సత్కారం పొందిన వారిలో టి. శ్రీనివాస్ గౌడ్ (ఏఎస్సై , టౌన్ 5 పీఎస్), శేలంపల్లి వెంకటేశ్వర్ (ఏఎస్సై, నవీపేట్ పీఎస్), అబ్దుల్ హమీద్ ఖాన్ (ఏఎస్సై , టౌన్ 3 పీఎస్), నీలి శేఖర్ (హెడ్ కానిస్టేబుల్, కంట్రోల్ రూమ్) ఉన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, జగతి, వసమాల, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మల్లేష్, ఆర్ఐలు ధరణి కుమార్, శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



భారత ఉక్కుమహిళ ఇందిరాగాంధీ

అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్ : భారత దేశ ఉక్కు మహిళ ఇందిరాగాంధీ అని డీసీసీ నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. 1966లో భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఇందిర, క్లిష్ట సమయాల్లో ధైర్యమైన, విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని దేశాన్ని ప్రగతి పథంలో నడిపించారన్నారు. అలాగే దేశచరిత్రలో భారత ఉక్కు మనిషిగా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్, గన్‌రాజ్, కౌదపు శరత్, అంతరెడ్డి విజయ్ పాల్ రెడ్డి, యాదగిరి, బంటు బలరాం పాల్గొన్నారు.



రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం.. మిల్లులకు చేరుతోంది. అక్కడి నుంచి బియ్యంగా మారి తిరిగి ప్రభుత్వానికి చేరాల్సి ఉంది. కానీ ఈ లావాదేవీల్లో ఏళ్ల తరబడి బకాయిలు పేరుకుపోతున్నాయి. దీంతో తాజాగా జిల్లాలో సీఐడీ అధికారులు రంగంలోకి దిగారు. ఏకంగా 16మంది రైస్ మిల్లర్లపై కేసులు నమోదు చేశారు. ఈ భయంలో ఇద్దరు మిల్లర్లు పరారీలో ఉండగా.. 14మందిని రిమాండ్ నుంచి కస్టడీకి తీసుకుని అధికారులు విచారిస్తున్నారు.
– అక్షరటుడే, భీమ్‌గల్

మిల్లర్లకు సీఐడీ వణుకు..

■ రైస్‌మిల్లర్ల గుండెల్లో దడ పుట్టిస్తున్న సీఐడీ ■ ఏళ్ల తరబడి పేరుకుపోతున్న సీఎంఆర్ బకాయిలు
■ 2014-15 నుంచి 2023-24 వరకు పాత లెక్కలపై సర్కారు దృష్టి
■ పక్కా ఆధారాలతో దాడులు.. ■ తనిఖీల్లో బయటపడుతున్న బియ్యం నిల్వల గోల్‌మాల్

సీఎంఆర్ బకాయిల సమస్య ఇప్పటిది కాదు. 2021-22 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 494 మంది మిల్లర్ల నుంచి 2.22 లక్షల టన్నుల కస్టమ్ మిల్లింగ్ బియ్యం రావాల్సి ఉన్నట్లు 2023లోనే వెల్లడైంది. బకాయిలు అధికంగా ఉన్న జిల్లాల్లో నిజామాబాద్ కూడా ఉంది. అప్పట్లోనే వసూళ్ల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి వచ్చింది. అయినా సమస్య పూర్తిగా పరిష్కారమైన దాఖలాలు కనిపించడం లేదు.

90 రోజులు గడువిచ్చినా..

మరోవైపు 2014-15 నుంచి 2023-24 వరకు వివిధ సీజన్లలో బకాయిపడిన మిల్లర్ల నుంచి సీఎంఆర్ బియ్యాన్ని వసూలు చేసేందుకు 2025 నవంబరు 24న ప్రభుత్వం ప్రత్యేక మెమో జారీ చేసింది. 90 రోజుల్లోగా బకాయి బియ్యం అందించాలని లేదా బకాయి విలువలో 125 శాతాన్ని జరిమానా, 12 శాతం వడ్డీతో చెల్లించాలని నిర్దేశించింది. 2026 మార్చిలోనూ ఈ అంశంపై గడువు పొడిగింపునకు సంబంధించిన పరిణామాలు హైకోర్టు కేసుల్లో ప్రస్తావనకు వచ్చాయి. అంటే పాత బకాయిల వసూలు ప్రక్రియ ఎంతకాలంగా సాగుతోందో అర్థమవుతోంది.

లెక్కల్లో ధాన్యం.. క్షేత్రస్థాయిలో కొరత

నిజామాబాద్ జిల్లాలో సీఐడీ విచారణలోనూ నిల్వల వ్యత్యాసాలు బయటపడ్డాయి. కేసు డైరీ ప్రకారం 16 రైస్ మిల్లుల్లో తనిఖీలు చేయగా తొమ్మిది మిల్లుల్లో 2,460.531 మెట్రిక్ టన్నుల ధాన్యం కొరత గుర్తించారు. మరోవైపు ఆరు మిల్లులు 667 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యానికి బదులుగా దొడ్డు రకం బియ్యాన్ని ఎఫ్‌సీఐకి సరఫరా చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందువల్ల ప్రభుత్వానికి సుమారు రూ.67 లక్షల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా.

నాణ్యత మార్చి.. లాభం పెంచుకునే ఎత్తుగడ?

సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం ప్రత్యేక బోనస్‌తో కొనుగోలు చేసి మిల్లులకు కేటాయించింది. ఒప్పందం ప్రకారం అదే రకం బియ్యాన్ని తిరిగి అందించాలి. అయితే సన్నరకం ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో విక్రయించి, తక్కువ ధరకు లభించే దొడ్డు రకం బియ్యాన్ని సేకరించి ఎఫ్‌సీఐకి సరఫరా చేసినట్లు సీఐడీ దర్యాప్తులో ఆరోపణలు వెలుగుచూశాయి. కొన్ని చోట్ల ఇతర రాష్ట్రాల నుంచి బియ్యం కొనుగోలు చేసినట్లు కూడా ఫిర్యాదులో ప్రస్తావించారు. అంటే ధాన్యం నిల్వలకే కాకుండా బియ్యం నాణ్యత, రకం నిర్ధారణలోనూ పర్యవేక్షణ అవసరమనే విషయం స్పష్టమవుతోంది.

పాత బకాయిల సంగతేంటి?

ఇక్కడే కీలకమైన ప్రశ్న తలెత్తుతోంది. గత సీజన్లలో బకాయిలు ఉన్న మిల్లులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? బకాయి ఉన్నప్పటికీ తదుపరి సీజన్లలో వారికి ధాన్యం కేటాయించారా? కేటాయించినట్లయితే ఏ నిబంధనల ప్రకారం అనుమతించారు? మిల్లుల్లో ఉన్న నిల్వలను ఎప్పటికప్పుడు భౌతికంగా తనిఖీ చేశారా? బకాయిలకు గడువు పొడిగించిన తర్వాత ఎంతమేర బియ్యం తిరిగి వచ్చింది? ఎంత మొత్తం వసూలైంది? ఈ వివరాలన్నింటినీ వెల్లడించాల్సిన అవసరం ఉంది. బకాయిలు ఉన్న మిల్లులను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి.

అధికారుల పాత్రపై అనుమానాలు..

ప్రభుత్వ ధాన్యం అప్పగించినప్పటి నుంచి బియ్యం తిరిగి స్వీకరించే వరకు ప్రతి దశలో అధికారుల వద్ద రికార్డులు ఉంటాయి. ధాన్యం కేటాయింపు, మిల్లులో నిల్వ, మిల్లింగ్, బియ్యం రవాణా, ఎఫ్‌సీఐ గోదాముల్లో స్వీకరణ.. ఇలా ప్రతి దశకు సంబంధించిన లెక్కలను సరిపోల్చితేనే అసలు లోపం ఎక్కడ జరిగిందో తేలుతుంది. తాజా సీఐడీ దర్యాప్తులో అధికారుల పాత్రపైనా విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ అంశాలపై సమగ్ర పరిశీలన అవసరం.



ఎల్‌నినో నేపథ్యంలో నీటి పాదుపును పాటించాలి: ఎంపీ అర్వింద్

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : ఎల్‌నినో కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు నీటి పొదుపును పాటించాలని ఎంపీ అర్వింద్ సూచించారు. కలెక్టరేట్‌లో 'దిశ' సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా వాడుకోవాలన్నారు. మాధవనగర్, అర్సపల్లి ఆర్వోబీ నిర్మాణాల్లో ఎనలేని తాత్సారం జరుగుతోందని సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. నాలుగైదు నెలలలో పనులు పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులను కూడా వచ్చే ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న తాగునీటి సరఫరా మెరుగుదల పనులను, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఎల్‌నినో నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలు వెల్లడించారు. ప్రస్తుత యాసంగిలో పంటలకు సాగునీరు అందించే పరిస్థితి లేదన్నారు. వర్షాభావం, ఇతర పరిస్థితులను పరిగణలోకి తీసుకుని జిల్లాలోని 18 మండలాలలో సాధారణ కరువు నెలకొని ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు.



జాతీయ ఐక్యతకు కృషి చేసిన మహానుభావుడు వల్లభాయ్ పటేల్

అక్షరటుడే, ఇందూరు : జాతీయ ఐక్యత కోసం కృషి చేసిన మహానుభావులు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. పటేల్ జయంతి సందర్భంగా శనివారం నగరంలోని వర్ని చౌరస్తాలో ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 562 సంస్థానాలను విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. దేశ సమగ్రత ఐక్యతకోసం ఆయన చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తి దాయకమన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గుజరాత్‌లో ప్రపంచంలోనే ఎత్తైన 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' పటేల్ విగ్రహాన్ని నిర్మించి ఘనమైన నివాళి అందించారన్నారు. అలాగే నిజాం నిరంకుశ పాలనకు ముగింపు పలికి హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి పటేల్ కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు కల్పే అర్చనా చిరంజీవి, జగదీష్ కుల కర్ణి, మల్కాయి మహేందర్, మఠం పవన్, న్యాలం సునీత రాజు, నాయకులు కల్పె చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రాష్ట్రీయ ఏక్తా దివస్



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేశారు. ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, మేయర్ కే.ఉమారాణి, జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు తదితరులు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం, అధికారులు, సిబ్బందిచే జిల్లా రెవెన్యూ అధికారిణి గీత ప్రతిజ్ఞ చేయించారు.

కార్మికులు సమయపాలన పాటించాలి : మున్సిపల్ కమిషనర్



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : మున్సిపల్ కార్మికులు సమయపాలన పాటిస్తూ విధులకు హాజరు కావాలని కమిషనర్ దిలీప్‌కుమార్ అన్నారు. శనివారం తెల్లవారుజామున ఆయన పలు జోన్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జోన్ కార్యాలయానికి చేరుకున్న ఆయన మొదట కార్మికులకు సంబంధించిన హాజరుపట్టికను తనిఖీ చేశారు. కార్మికుల హాజరును ధృవీకరించి, వారు సమయానికి విధులకు హాజరవుతున్నారా.. వారికి అప్పగించిన పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వర్తిస్తున్నారా లేదా అని పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరమంతటా పరిశుభ్రతను కాపాడటానికి కార్మికులు సమయపాలన, క్రమం తప్పని హాజరు ఉండాలన్నారు. పారిశుధ్య విధులను సమర్థవంతంగా నిర్వర్తించడం ప్రాముఖ్యతను కమిషనర్ వివరించారు. ఈ తనిఖీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నాచౌక్ పరిసరాలు శుభ్రం చేసిన ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు

అక్షరటుడే, కామారెడ్డి : ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 19వ రోజు కొనసాగింది. శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ధర్నాచౌక్ ప్రాంతాన్ని ఉద్యోగులు శుభ్రం చేసి చెత్తను కాల్చేసి తమ నిరసనను వినూత్న రీతిలో చేపట్టారు. జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా ఉద్యోగులంతా ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. జిల్లా జేఏసీ అధ్యక్షుడు సుమన్ మాట్లాడుతూ 19 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని, దీంతో క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు అందడంలో జాప్యం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జేఏసీ ఉపాధ్యక్షుడు వెంకటరమణ, జేఏసీ నాయకులు అశ్విని, డా.మౌనిక, రాజు, సుశీల, సవిత, విమల, డా.రాహుల్, డా.రాజశేఖర్, డా.వేణుమాధవ్, డా. రవళి, అరుణ, యాదమ్మ, విజయ్, అఖిల్, గౌతమి తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా ఆసక్తి పెంచడమే లక్ష్యం

అక్షరటుడే, కామారెడ్డి : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యమని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ఇస్రోను సందర్శించే అవకాశాన్ని కల్పించేందుకు శనివారం ప్రత్యేక పోటీ పరీక్ష నిర్వహించారు. గతేడాది నిర్వహించిన ఇస్రో క్విజ్ పోటీల్లో సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రతిభ ఆధారంగా ఎంపికైన 50 మంది విద్యార్థులతో పాటు 30 మంది ఉపాధ్యాయులకు ఇస్రోను సందర్శించే అవకాశం కల్పించారు. ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా మొత్తం 772 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో కామారెడ్డి డివిజన్ నుంచి 552 మంది, బాన్సువాడ డివిజన్ నుంచి 220 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్ష ద్వారా ప్రతిభ కనబరిచిన 50 మంది విద్యార్థులను, 30 మంది ఉపాధ్యాయులను ఇస్రో విద్యా సందర్శనకు ఎంపిక చేయనున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గిరి, జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరామిరెడ్డి, వివిధ పాఠశాలల భౌతిక, రసాయన, జీవశాస్త్ర ఉపాధ్యాయులు, వివిధ మండలాల నుంచి హాజరైన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఓటు చోరీ' ధర్నాకు వెళ్లిన గడ్డం చంద్రశేఖర్ రెడ్డి



అక్షరటుడే, కామారెడ్డి: ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన చలో ఢిల్లీ ఓటు చోరీ కార్యక్రమంలో పాల్గొనేందుకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ తమ పార్టీ కార్యకర్తలతో కలిసి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు పవిత్రతను కాపాడటం, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను సాధించడం లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వారు పాల్గొననున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి ఓటుకు విలువ ఉండాలని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గడ్డమీది మహేష్, డీసీసీ ఉపాధ్యక్షుడు పంపరి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్లు పంపరి శ్రీనివాస్, జమీల్, సాయి బాబు, కామారెడ్డి నియోజకవర్గ సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ యూత్ అధ్యక్షుడు నర్సిల్ల మహేష్, రాహుల్ ఉన్నారు.

పిల్లలకు సురక్షిత బాల్యం కల్పించడం అందరి బాధ్యత : సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి



అక్షరటుడే, కామారెడ్డి : పిల్లలకు సురక్షిత బాల్యం అందించడం అందరి బాధ్యత అని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.నాగరాణి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత బచ్‌పన్ అభియాన్, పోక్సో చట్టం, పిల్లలకు సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై మాచారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి చిన్నారికి భయరహితమైన, సురక్షితమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని నాగరాణి పేర్కొన్నారు. పిల్లలు దేశ భవిష్యత్తుకు పునాదులని, వారు ఆరోగ్యకరమైన వాతావరణంలో ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. బాలలపై జరిగే లైంగిక వేధింపులు, అక్రమ రవాణా, బాల కార్మికత్వం వంటి వాటిని అరికట్టేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ లిలియాని, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ జి. స్వరూప, కోర్టు సిబ్బంది ఖాజా సమీ ఉల్లాహ్ ఖాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి బెటాలియన్‌లో ఏక్తా దివస్



అక్షరటుడే, డిచ్‌పల్లి: దేశ తొలి ఉప ప్రధానమంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లో జాతీయ ఏక్తా దివస్ నిర్వహించారు. వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి అసిస్టెంట్ కమాండెంట్ దేవినేని శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ అనుపమ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేశ సమగ్రత, ఐకత, సమైక్యతను కాపాడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. బెటాలియన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి మున్సిపాలిటీ

ఓ స్థలాన్ని వెంచర్‌గా మార్చాలంటే సవాలక్ష నిబంధనలు అడ్డువస్తాయి. రెవెన్యూ స్థలాన్ని వెంచర్‌గా మార్చిన తర్వాత మున్సిపాలిటీ అప్రూవల్ తప్పనిసరిగా కావాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వెంచర్ చేసిన మొత్తానికి 10 శాతం స్థలాన్ని మున్సిపాలిటీకి అప్పగించాల్సి ఉంటుంది. అయితే ఈ పదిశాతం స్థలం అందుబాటులోనే ఉందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

- అక్షరటుడే, కామారెడ్డి

వెంచర్లలో ఓపెన్ స్థలాల దందా..

■ 10 శాతం స్థలాన్ని కబ్జా చేస్తున్న పలువురు
■ బై నంబర్లు ఇస్తూ రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు ఆరోపణలు ■ పట్టించుకోని బల్దియా అధికారులు

కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో గడిచిన పదేళ్లలో విచ్చలవిడిగా వెంచర్లు వెలిశాయి. పట్టణంతో పాటు శివారు ప్రాంతాల్లో వెలిసిన వెంచర్లలో అనేక అక్రమాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ వెంచర్లలో మున్సిపాలిటీ కోసం వదిలిన స్థలాలు భద్రమేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

బై నంబర్లతో రిజిస్ట్రేషన్లు..?

కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో వెంచర్లలో పార్కు కోసం వదిలిన 10 శాతం స్థలాన్ని మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారా అనే అనుమానాలు ఇటీవల బలంగా వినిపిస్తున్నాయి. ఒకవేళ రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చినా, వాటికే బై నంబర్లు ఇస్తూ అమాయక ప్రజలకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీకి చెందిన స్థలాలను ప్రైవేట్ వ్యక్తులకు విక్రయిస్తూ, కొన్ని చోట్ల ప్లాట్లుగా మార్చి అమ్మేస్తున్నారనే చర్చ జోరుగా సాగుతోంది. రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఈ పార్కు స్థలాలకు అనుమతులు ఎలా వస్తున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఇంటి నిర్మాణంతో అనుమానాలు

ఇటీవల పట్టణంలోని ఓ వార్డులో మున్సిపాలిటీ అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే సంబంధిత స్థలం కూడా మున్సిపాలిటీకి సంబంధించిన ఓపెన్ స్థలమని అధికారులు స్పష్టంగా చెప్తున్నారు. ఈ స్థలం ఇంటి నిర్మాణం చేపడుతున్న యజమానికి రిజిస్ట్రేషన్ కావడంతో ఆ స్థలం తనదేనని యజమాని చెప్తున్నాడు. అయితే ఇదే స్థలానికి బై నంబర్ ఇచ్చి ఇంటి యజమానికి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారన్న ప్రచారం సాగుతోంది. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపి బై నంబర్ ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసిన మాట నిజమని తేలితే సంబంధిత వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ అంశంతో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వెంచర్లలో 10శాతం స్థలం మున్సిపాలిటీ పరిధిలోనే ఉందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

వెంచర్లలో సాగుతున్న భాగోతం..

వెంచర్ వేసే సమయంలో మ్యాప్‌లో పార్కు, ఓపెన్ స్పేస్ చూపించి అప్రూవల్ తీసుకున్న తర్వాత, క్షేత్రస్థాయిలో ఆ స్థలాలను కబ్జా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కొన్ని వెంచర్లలో పార్కు స్థలంలోనే షెడ్లు, ఇళ్లు నిర్మించడం, మరికొన్ని చోట్ల ప్లాట్లుగా విభజించి విక్రయించడం జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు మాత్రం తనిఖీలు చేయకపోవడం, ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.



ఆర్డీవో కార్యాలయంలో జాతీయ సమైక్యతా దినోత్సవం

అక్షరటుడే, ఎల్లారెడ్డి: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో శనివారం రాష్ట్రీయ ఏక్త దివస్ (జాతీయ సమైక్యతా దినోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఆర్డీవో ప్రభాకర్, కార్యాలయ అధికారులు, సిబ్బందితో జాతీయ సమైక్యతా ప్రతిజ్ఞ చేయించారు. దేశ ఐకత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ, దేశాన్ని ఏకతాటిపైకి తీసుకురావడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన చూపిన ఐక్యతా మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని దేశ సమగ్రతను కాపాడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ తహశీల్దార్లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



ఇందిరా గాంధీకి ఘన నివాళులు

అక్షరటుడే, బాల్కొండ: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణ కాంగ్రెస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానిగా దేశానికి ఆమె అందించిన సేవలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను నాయకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కుందారపు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సంజీవ్ గౌడ్, యూత్ ఉపాధ్యక్షుడు వికీ, మండల కార్యదర్శులు పుప్పల విద్యాసాగర్, పుల్లాయి నవీన్ కుమార్, దోస్‌పాల్ సాయన్న, మారపురుషోత్తం, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు మేక సతీష్, కాంగ్రెస్ నాయకులు మెట్టు అశోక్, నాసం నరేష్, మల్కన్న తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల పెన్షన్‌లో ఇన్‌స్టంట్ విధానం అభినందనీయం



అక్షరటుడే, కామారెడ్డి: గీత కార్మికులు మరణిస్తే వారి భార్యలకు వెంటనే పెన్షన్ ఇచ్చే ఇన్‌స్టంట్ విధానాన్ని అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సైదగౌని వెంకట్ గౌడ్ తెలిపారు. శనివారం కామారెడ్డిలో జరిగిన కల్లు గీత కార్మిక సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గీత కార్మికుడు మరణిస్తే వారి భార్య మళ్లీ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలనే పద్ధతిని తొలగించాలని కొన్నేళ్లుగా సంఘం ప్రభుత్వాన్ని కోరుతూ వస్తోందన్నారు. అలాగే ఇటీవల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న 37,381 మంది గీత కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్ గౌడ్, శంకర్ గౌడ్, రాజా గౌడ్, జిల్లా కార్యదర్శి రాజా గౌడ్, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంత నిర్మాణ పనులు ప్రారంభం



అక్షరటుడే, ఎల్లారెడ్డి: మురుగునీటి సమస్యను నివారించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భూగర్భ జలాల సంరక్షణ లక్ష్యంగా వెల్లుట్ల పేట గ్రామంలో డ్రైనేజీ చివరన ఇంకుడు గుంత నిర్మాణ పనులు చేపట్టారు. డ్రైనేజీ ద్వారా వచ్చే నీటిని తగిన విధంగా వడపోసి భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా నీటి నిల్వలు తగ్గించడంతో పాటు భూగర్భ జలాల రీఛార్జీకి అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ప్లాస్టిక్, చెత్తాచెదారం, ఘన వ్యర్థాలు ఇంకుడు గుంతలోకి చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొయ్యల వినోద్ రాజా గౌడ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధితో పాటు పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, గ్రామ ప్రజలు కూడా పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ నరేష్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ భూమయ్య పాల్గొన్నారు.

దామరంచలో పౌర హక్కుల దినోత్సవం

అక్షరటుడే, బాన్సువాడ: కుల, మత వివక్షలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో జీవిస్తూ కుల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని బీర్కూర్ తహశీల్దార్ సవాయ్ సింగ్ అన్నారు. బీర్కూర్ మండలంలోని దామరంచ గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బోయిని శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తహశీల్దార్, ఏఎస్సై ఉమ్రూ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. అంటరానితనం నేరమని, ఎస్సీ, ఎస్టీల పట్ల కుల వివక్ష చూపినా, అంటరానితనాన్ని పాటించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుల, మత భేదాలు లేకుండా సమానత్వ భావనతో కుల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సాంకేతిక, శాస్త్ర విజ్ఞాన రంగాల్లో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



అక్షరటుడే, బాన్సువాడ: సాంకేతిక, శాస్త్ర విజ్ఞాన రంగాల్లో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థినులకు ఇస్రోను సందర్శించేందుకు పట్టణంలోని భారతరత్న జూనియర్ కళాశాలలో అర్హత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత ఆధునిక యుగంలో శాస్త్ర, సాంకేతిక రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. అంతరిక్ష పరిశోధనలు, ఉపగ్రహాల ప్రయోగాలు, సాంకేతిక ఆవిష్కరణల్లో భారతదేశం ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతోందని పేర్కొన్నారు. ఇస్రో వంటి ప్రతిష్ఠాత్మక సంస్థను సందర్శించడం విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందిస్తుందని అన్నారు. ఎంఈవో నాగేశ్వరరావు, జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కుషాల్, జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

అక్షరటుడే, కామారెడ్డి: ఇటీవల బస్సు ప్రమాదాలు తరచుగా చోటు చేసుకుంటున్నాయి. డ్రైవర్లు అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. తాజాగా సదాశివనగర్ మండలం కుప్రియాల్ సమీపంలో జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొంది. కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న కారును గాంధారి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కుప్రియాల్ స్టేజి వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రమాదంలో కారు వెనకభాగం దెబ్బతింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మస్కట్‌లో ఉట్నూరు సాయాగౌడ్‌కు ఘనంగా వీడ్కోలు



అక్షరటుడే, ఆర్మూర్ : ఒమన్‌లోని పూలే అంబేడ్కర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉట్నూరు సాయాగౌడ్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. మస్కట్ బల్దియాలో 27ఏళ్లుగా సేవలందించి, పదవీ విరమణ అనంతరం స్వదేశానికి తిరిగి వెళ్తున్న పూలే అంబేడ్కర్ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యుడు సాయాగౌడ్‌ను కమిటీ సభ్యులు, వివిధ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఇదే సందర్భంగా మురో కమిటీ సభ్యుడు ప్రభాకర్ అలియాస్ భూమేష్‌ను కూడా సత్కరించారు. అతిథిగా హాజరైన అంబేడ్కర్ ఇంటర్నేషనల్ ఒమాన్ సెక్రటరీ సందీప్ మెహతా మాట్లాడుతూ.. మనం ఎక్కడ ఉన్నా అంబేడ్కర్ వాదమే మనల్ని కలుపుతుందన్నారు. ఒమాన్ తెలంగాణ సమితి ప్రతినిధులు అహ్మద్, సుంకరి రవి, కుమార్‌లు మాట్లాడుతూ, సాయన్న సమాజ సేవలో భాగస్వాములవుతూ వారు చేసిన సేవలు మనందరికీ ఆదర్శం అన్నారు. దులూర్ శేఖర్, దుబ్బాక నవీన్ పాటలు సభికులను అలరించాయి. పూలే అంబేడ్కర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు వేణు, శ్రీనివాస్, గంగాధర్, కమలాకర్, లక్ష్మన్, సంజీవ్, ఏపీ నాగరాజు, క్యాంపు బాస్ నాగరాజు, సుభాష్, నారి నరేష్, జోయస్ పాల్గొన్నారు.